కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు 103 దరఖాస్తులు

- ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలి
- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వర్ధన్నపేట : చెరువు ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కలెక్టరేట్ ఎదుట అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న సురేందర్

ఖిలావరంగల్, మార్చి 10 : వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 103 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ప్రధానంగా భూసంబంధిత సమస్యలే 53 ఉన్నాయి. దుగ్గొండి మండలం పొనకల్‌కు చెందిన గట్ల సురేందర్ వంశ పారంపర్య భూమిని అక్రమంగా తన సోదరుడికి అప్పటి తహసీల్దార్ పట్టా చేశారని, దానికి మాజీ సర్పంచులు సహకరించారని ఆరోపిస్తూ కలెక్టరేట్ ఎదుట అర్ధనగ్నంగా నిరసన తెలిపాడు. బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, పాస్‌బుక్‌ను రద్దు చేయాలని కలెక్టర్‌ను కోరాడు. కాగా, భూమి కబ్జా చేశారని మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోకుండా తనపైనే కేసు నమోదు చేసినట్లు దేశాయిపేటకు చెందిన జన్ను నూతన్ బాబు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించాడు. తక్కువ కులానికి చెందిన వాడిని కాబట్టే పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించాడు. అలాగే, కుల పెద్దలు చెప్పినప్పటికీ తన భార్య కాపురానికి రావడం లేదని నెక్కొండ మండలం టిక్యాతండాకు చెందిన భూక్యా బాలు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. దీనిపై నిలదీసినందుకు తన చిన్న అత్త మంజరి 9 మంది కలిసి ఇంటిపైకి దాడిచేశారని, ఈ విషయంపై చెన్నారావుపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వారితో తన కుటుంబానికి ప్రాణ హాని ఉందని, చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించాడు. అలాగే తమ కష్టార్జిత ఆస్తులను కోడలు ప్రభావతి, మనువడు నిఖిల్ వారి పేర్లమేద రిజిస్ట్రేషన్ చేసుకొని ఇంటికి రానియకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని గీసుగొండ మండలం అనంతారం గ్రామానికి చెందిన దనేకుల చెంచమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. అలాగే, ఆకేరును నమ్ముకొని ప్రత్యక్షంగా, పరోక్షంగా 5 వేల కుటుంబాలు బతుకున్నాయని, తమకు ఇసుకను అమ్ముకోవడానికి అనుమతి ఇవ్వాలంటూ సుమారు 100 మంది కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ దరఖాస్తులను పెండింగ్ పెట్టకుండా సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

తలనీలాల అవినీతిపై చర్యలు తీసుకోవాలి

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ దర్గాలో తలనీలాలు మాయం చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్య శారదా దేవికి గ్రీవెన్స్‌లో తెలంగాణ అంబేద్కర్ సంఘం జిల్లా కో కన్వీనర్ జంగిలి భాస్కర్ వినతిపత్రం అందజేశారు. దర్గాలో సుమారు రూ.60 లక్షల విలువగల తలనీలాలను ఎలాంటి అనుమతులు లేకుండా విక్రయించారని, అవినీతి జరిగిన సొమ్మును తిరిగి వక్ఫ్ బోర్డు అధికారులు స్వాధీనం చేసుకోవాలని ఆయన కోరారు. నాయకులు గుండె సురేశ్, తాటికాయలు ఎల్లయ్య, రాజు, రమేశ్ పాల్గొన్నారు.

కోనారెడ్డి చెరువు ఆక్రమణపై విచారణ జరపాలి

వర్ధన్నపేట : కోనారెడ్డి చెరువు శిఖం ఆక్రమణపై విచారణ చేపట్టాలని మాజీ జడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఏఎంసీ మాజీ చైర్మన్ గుజ్జ సంపత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, జిల్లా నాయకులు సిలువేరు కుమారస్వామి, చొప్పరి సోమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రీవెన్స్‌లో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జీ మధుసూదన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వర్ధన్నపేటలోని కోనారెడ్డి చెరువు శిఖాన్ని కొంత మంది ఆక్రమించి కట్టలు పోయడం వల్ల చెరువు సామర్థ్యం తగ్గిపోయిందన్నారు. దీంతో తరుచూ కట్ట కోతకు గురవుతున్నదన్నారు. మత్తడి కూడా ఆక్రమణకు గురికావడం వల్ల వర్షకాలంలో నీరు బయటకు వెళ్లక కట్ట తెగిపోతున్నదని వివరించారు. అలాగే, దమ్మన్నపేట, జగ్గిపేట, గన్నారం గ్రామాలకు వెళ్లే దారిని కూడా కొంత మంది కబ్జా చేయడం వల్ల బాట లేకుండా పోయిందన్నారు. ఇందుకు సంబంధించిన ఆర్టీఏ ద్వారా తీసుకున్న సమాచారాన్ని కలెక్టర్‌కు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తిరుపతి సురేశ్, ఎండీ అజీమ్, పిట్టల రాజు పాల్గొన్నారు.

25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

- మార్చి 31 వరకు గడువు
- కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద

వరంగల్, మార్చి 10 : ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వం ప్రకటించిన 25 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద సూచించారు. సోమవారం కుడా కార్యాలయంలో గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి డెవలపర్స్, సర్వేయర్లు, స్థల యాజమానులకు ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్లు మాట్లాడుతూ మార్చి 31 వరకు ఎల్ఆర్ఎస్ పూర్తి స్థాయి డబ్బులు చెల్లించిన వారికి 25 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. దీన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2020 ఆగస్టు 26 కంటే ముందు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లను ప్రభుత్వ నిబంధన మేరకు భూములను క్రమబద్ధీకరిస్తున్నట్లు తెలిపారు. రాయితీని పొడిగించే అవకాశం లేదన్నారు. బిల్డర్లు, ఓనర్లు ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఎల్ఆర్ఎస్ చేసుకోని వారు ఇంటి అనుమతి కోసం భూమి విలువపై 14 శాతం ఫీజు చెల్లించాల్సి వస్తుందన్నారు. ఏదేని కారణాల చేత ఎల్ఆర్ఎస్ దరఖాస్తు తిరస్కరణకు గురైతే ప్రాసెసింగ్ ఫీజులో 10 శాతం మినహాయించుకొని తిరిగి వారి ఖాతాలో జమచేయనున్నట్లు తెలిపారు. ఎల్ఆర్ఎస్ ఉంటే ప్లాటుకు రక్షణ ఉంటుందన్నారు. సమావేశంలో కుడా ప్లానింగ్ అధికారి అజిత్‌రెడ్డి, బల్దియా ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి, సంబంధిత శాఖల అధికారులు, బిల్డర్లు, డెవలపర్లు, సర్వేయర్లు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

తాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు

ఖిలావరంగల్, మార్చి 10 : వేసవిలో తాగునీరు, విద్యుత్ సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, వ్యవసాయ, మిషన్ భగీరథ, విద్యుత్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు ఫేజ్-1 గ్రామాల్లో మంజూరైన వాటిని గుర్తించి ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అలాగే, మిగిలిన గ్రామాల్లో ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 కేటగిరిలో ఎంపిక చేసిన ఇండ్ల దరఖాస్తులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీ గణపతిని ఆదేశించారు. మరమ్మతుకు గురైన బోరు బావుల స్థానంలో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలన్నారు. యాసంగిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. సమావేశంలో డీఏవో అనురాధ, డీసీవో నీరజ, డీపీవో కల్పన, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, కలెక్టరేట్ ఏవో విశ్వప్రసాద్ పాల్గొన్నారు.

అక్రమ వెంచర్‌లో హద్దురాళ్ల తొలగింపు

నర్సంపేట, మార్చి10 : పట్టణంలోని మాదన్నపేట రోడ్డులో నిబంధనలు పాటించని అక్రమ వెంచర్‌లోని హద్దురాళ్లను సోమవారం మున్సిపల్, రెవెన్యూ అధికారులు తొలగించారు. సర్వే నంబర్ 111/1/91, 111/1/92లో కొందరు ఇటీవల ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే వెంచర్ చేసి హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. కాగా, పట్టణానికి చెందిన రామ అనసూర్యాదేవి వద్ద 2019 జనవరిలో 6 ఎకరాల భూమిని కొనుగోలు చేశానని, దాన్ని కొందరు ఆక్రమించుకుని వెంచర్ చేశారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామినాయక్ ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో సోమవారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్ టీపీఎస్‌వో సంధ్యారాణి, ఆర్ఐ యూసుఫ్‌అలీ ఆధ్వర్యంలో అధికారులు వెంచర్ వద్దకు చేరుకొని పరిశీలించారు. అనుమతులు లేకుండా చేపట్టిన వెంచర్‌లోని హద్దురాళ్లను జేసీబీతో తొలగించారు.

శ్రీధరాచార్యులను సన్మానిస్తున్న నిర్వాహకులు

శ్రీధరాచార్యులకు భారత కళా గౌరవ్ పురస్కార్

పోచమ్మమైదాన్, మార్చి 10 : వరంగల్ ఎల్‌బీ నగర్‌లోని మాసూం అలీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ రయ్యాల శ్రీధరాచార్యులకు భారత కళా గౌరవ్ పురస్కార్ 2025 అవార్డును ప్రదానం చేశారు. టెలివి9 చేతన బ్రాడ్‌కాస్టింగ్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన వార్షికోత్సవంలో ఆయన అవార్డు అందుకున్నారు. శ్రీధరాచార్యులు విద్యా, సాంస్కృతిక, క్రీడా, సామాజిక రంగాల్లో అందించిన సేవలను గుర్తించి సత్కరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
jobs Apply Now!
★లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

భూ 'వివాదాల' ఠాణా

కరీమాబాద్, మార్చి 10 : భూ 'వివాదాల'తో మిల్స్‌కాలనీ ఠాణా నిత్యం వార్తల్లో ఉంటోంది. ఇటీవల ఓ భూ వివాదం విషయంలో హైకోర్టు షోకాజ్ నోటీసులు ఇచ్చిన విషయం విదితమే.. తాజాగా మళ్లీ హైకోర్టు మందలించినట్లుగా సమాచారం. మహిళలకు రక్షణగా నిలువాల్సిన పోలీసులు అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు మహిళను అక్రమంగా పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. ఈ విషయం సోషల్ మీడియాలో సైతం వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే... మిల్స్‌కాలనీ స్టేషన్ పరిధిలోని ఓ భూ వివాదంలో ఈ నెల 8న సాయంత్రం ఓ మహిళను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. విచారణ పేరుతో రాత్రి స్టేషన్‌లో ఉంచి ఆమెను కొట్టారని బాధితులు ఆరోపించారు. తర్వాత వారికి సంబంధించిన మరో ఇద్దరిని సైతం అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. బాధితుల కుటుంబ సభ్యులు కోర్టును ఆశ్రయించినట్లుగా తెలిసింది. విషయం తెలిసిన పోలీసులు వారిని స్టేషన్ నుంచి వేరే చోటుకు తరలించినట్లుగా బాధితులు ఆరోపించారు. ఈ విషయమై మిల్స్‌కాలనీ పోలీసులను వివరణ కోరగా తాము ఎవరినీ తీసుకురాలేదని తెలిపారు. కాగా, భూ వివాదాల్లో పోలీసుల తీరు వివాదాస్పదంగా మారుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీపీగా కొత్త బాస్ బాధ్యతలు స్వీకరించిన తొలి రోజే భూ వివాదం.. మహిళ అక్రమ అరెస్టు విషయం సోషల్‌మీడియాలో చక్కర్లు కొట్టడం చర్చనీయాంశంగా మారింది.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి

మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శ

పరామర్శిస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

పర్వతగిరి, మార్చి 10 : మండల కేంద్రంలోని పోలకమ్మా చెరువు కట్ట మీద బైక్ అదుపుతప్పి ఒకరు చెరువులో పడి సోమవారం మృతిచెందారు. ఎస్సై భోగం ప్రవీణ్ కథనం ప్రకారం.. కల్లెడ గ్రామానికి చెందిన దుగ్యాల వసంతరావు ఫర్టిలైజర్ షాపు నిర్వహిస్తున్నాడు. సోమవారం తన బైక్‌పై పర్వతగిరి వైపు వస్తుండగా పోలకమ్మ చెరువు వద్ద అదుపుతప్పి కట్ట మీద రైలింగ్‌కి ఢీకొన్నాడు. ఈ క్రమంలో కింద పడగా తలకి బలమైన గాయమై చెరువులో పడిపోయి మృతి చెందాడు. మృతుడి కూతురు జూలపల్లి శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, దుగ్యాల వసంతరావు మృతి విషయం తెలుసుకున్న వెంటనే మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఘటన స్థలానికి వచ్చారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

చెన్నారావుపేట, మార్చి10 : ఇటీవల కూలీలతో వెళ్తున్న గూడ్స్ ట్రాలీ బోల్తా పడిన ఘటనలో తీవ్రంగా గాయపడిన జీడిగడ్డ తండాకు చెందిన బానోత్ ఈర్య(53) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 6న మండలంలోని జీడిగడ్డ తండాకు చెందిన 37 మంది వ్యవసాయ కూలీలు నర్సంపేట మండలం ఇప్పల్‌తండాలో మిర్చి ఏరడానికి గూడ్స్ ట్రాలీలో వెళ్తుండగా కోనాపురం శివారులో బోల్తా పడింది. దీంతో బానోత్ సుక్య అక్కడిక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన బానోత్ ఈర్యను ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్సపొందుతూ అతడు సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య భద్రమ్మ, కుమారులు వినోద్, యాకుబ్ ఉన్నారు.

గొడవలు సృష్టిస్తే ఉపేక్షించం : ఏసీపీ

గీసుగొండ, మార్చి 10 : కొమ్మాల జాతరకు రాజకీయ ప్రభ బండ్ల కట్టుకోవచ్చని, డీజేలకు అనుమతి లేదని, ఎవరైనా డీజేలు తెస్తే సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని మమునూర్ ఏసీపీ తిరుపతి, నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం జాతర ప్రాంగణంలో అన్ని రాయకీయ పార్టీల నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీలు మాట్లాడుతూ గత జాతరలో డీజేలతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్నారు. నిబంధనలు ఎవరూ అతిక్రమించినా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. జాతరలో గొడవలు సృష్టిస్తే ఉపేక్షించేది లేదన్నారు. సీఐలు మహేందర్, రమణమూర్తి, సాయిరాం, ఎస్సైలు కుమార్, ప్రశాంత్ బాబు, వెంకటేశ్వర్లు, రఘుపతి, ఈవో దయాకర్, అర్చకులు పాల్గొన్నారు. కాగా, మండలంలోని 21 గ్రామాలతో పాటు గ్రేటర్ 15,16వ డివిజన్‌లోని డీజే నిర్వాహకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ మహేందర్ తెలిపారు. జాతర సమయంలో ప్రభ బండ్ల వెంట డీజేలు పెడితే సీజ్ చేసి, రూ.5లక్షల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ఎమ్మార్పీఎస్ రిలే నిరాహార దీక్షలు

వరంగల్, మార్చి 10 : ఎస్సీ వర్గీకరణ అమలు చేశాకే ఉద్యోగ ఫలితాలు విడుదల చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఎంజీఎం సెంటర్‌లో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలను జాతీయ నాయకులు మంద కుమార్, వేల్పుల సూరన్న, బిర్రు మహేందర్ ప్రారంభించారు. నాయకులు విజయ్, మాసాని గోపాల్, ఇసంపల్లి రాజు, గోలి సుధాకర్, గొర్రె ప్రవీణ్, అనిల్ పాల్గొన్నారు.

యువతికి మంగళస్నానం చేయిస్తున్న అధికారులు

అనాథల పెళ్లి తంతు ప్రారంభం

నర్సంపేట, మార్చి 10: అనాథల పెళ్లి తంతు అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. నర్సంపేట మండలం భోజ్యనాయక్‌తండాకు చెందిన పాపావత్ రోజా, చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన అందె నాగరాణి తల్లి దండ్రులు చిన్నతనంలోనే మృతి చెందగా నర్సంపేటలోని సంజీవని ఆశ్రమంలో చదువుకున్నారు. మాతృభూమి చారిటబుల్ ట్రస్టు, సంజీవని ఆశ్రమ చైర్మన్ డాక్టర్ అర్మనపెల్లి మోహన్‌రావు-వినోద దంపతుల చేతుల మీదుగా వీరిద్దరి పెళ్లిల్లు ఈ నెల 12న సిటిజన్ క్లబ్‌లో జరుగనుంది. ఈ క్రమంలో సోమవారం ఐసీడీఎస్ సీడీపీవో మధురిమ ఆధ్వర్యంలో మంగళస్నానాలు చేయించి ఆశీర్వదించారు. అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతిరెడ్డి, కస్తూర్బా మహిళా మండలి అధ్యక్షురాలు గుర్రపు అరుణ, గుడిపూడి అరుణ, జయప్రద, సరళ, అన్నపూర్ణ, విజయలక్ష్మి, ఉష, ఉమాదేవి, శ్యామల, తేజమ్మ, శిరీష, కళావతి, కవిత, సూపర్‌వైజర్లు రాధ, మాధవి, సంకినేని జ్యోతి పాల్గొన్నారు.

బకాయిల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్

రాయపర్తి, మార్చి 10 : మండలంలో విద్యుత్ బకాయిల వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు రాయపర్తి సెక్షన్ ఏఈ పెద్ది రవళీరెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని విద్యుత్ ఉప కేంద్రంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని రాయపర్తి, మైలారం సెక్షన్ల పరిధిలోని 40 గ్రామాల్లో ఎస్ ఈలు మడూరి విక్రమ్‌కుమార్, ముజాఫర్ అహ్మద్ అలీ సారథ్యంలో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇంటింటికీ తిరుగుతూ బకాయిలు వసూలు చేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలో లైన్ ఇన్‌స్పెక్టర్ భూక్యా కిషన్‌నాయక్, లైన్‌మన్ బడితాపురం వెంకన్న, సిబ్బంది సారయ్య, రవి పాల్గొన్నారు.

ప్రీ ఫైనల్ పరీక్షల పరిశీలన

రాయపర్తి, మార్చి 10 : మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి ప్రీ ఫైనల్స్ పరీక్షల తీరుతెన్నులను సోమవారం డీసీఈబీ కార్యదర్శి గారె కృష్ణమూర్తి పరిశీలించారు. శ్రీ మహాత్మా మోడల్ పబ్లిక్ స్కూల్, సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలల్లో తనిఖీలు చేశారు. కార్యక్రమాలో ప్రిన్సిపాళ్లు సముద్రాల సరిత, సరికొండ శ్రీనివాస్‌రెడ్డి, సీఆర్‌పీ రమేశ్ పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

గీసుగొండ, మార్చి 10 : ఎండు గంజాయిని తీసుకెళ్తున్న ఇద్దరిని ఆరెస్టు చేసినట్లు సీఐ మహేందర్ తెలిపారు. గ్రేటర్ 15వ డివిజన్ గొర్రెకుంట కట్టమల్లన్న ఆలయం శివారులో సోమవారం ఉదయం జాన్‌పాకకు చెందిన అన్నం భాస్కర్, చింతల్‌కు చెందిన పెద్దపల్లి రవివర్మ అనుమానాస్పదంగా తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకొని తనిఖీలు చేసినట్లు పేర్కొన్నారు. వారి వద్ద ఉన్న కవర్లలో 900 గ్రాములు ఎండు గంజాయి దొరకడంతో వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

గీసుగొండ/రాయపర్తి, మార్చి 10 : గీసుగొండ మండలంలోని రాంపూరం, ఎలుకుర్తి గ్రామాలకు చెందిన నాగపూరి శ్రీను, బూసాని సమ్మక్క, మంద రమేశ్, రవి వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను సోమవారం వ్యాపారవేత్త అల్లం బాలకిశోర్‌రెడ్డి పరామర్శించి, రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట అల్లం మర్రెడ్డి, వీరగోని రాజుకుమార్, శోభన్‌కుమార్, గీసుగొండ సొసైటీ చైర్మన్ రడం శ్రీధర్ ఉన్నారు. అలాగే, గ్రేటర్ 16వ డివిజన్ ధర్మారం గ్రామానికి చెందిన సతీశ్ భార్య ఇటీవల మృతి చెందగా అతడి స్నేహితులు స్పందించి సతీశ్ కుమార్తె వైష్ణవి పేరుపై పోస్టాఫీసులో రూ.10 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, బాండ్‌ను అందజేశారు. శ్రీకాంత్, శంకర్, రాజు, ప్రసాద్, బాలరాజు పాల్గొన్నారు. కాగా, రాయపర్తి మండలంలోని కొత్తూరులో బొమ్మినేని దేవకమ్మ, పెర్కవేడులో మంచాల మల్లయ్య, ఊగ యాకయ్య, మైలారం గ్రామానికి చెందిన లింగాల కొమురయ్య తండ్రి ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. బాధితులకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ నేతృత్వంలో 50 కిలోల బియ్యం, వంట నూనె, నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు అయిత జంపి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుండగా బాధితుడిని పరామర్శించి రూ.5వేలు అందజేశారు. కార్యక్రమాల్లో లేతాకుల రంగారెడ్డి, జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్, పూస మధు పాల్గొన్నారు.

విలీన గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లను మున్సిపల్ ఉద్యోగులుగా గుర్తించాలి

నర్సంపేట, మార్చి 10 : నర్సంపేట గ్రేటర్ మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లను వెంటనే మున్సిపల్ ఉద్యోగులుగా ప్రకటించాలని మండల ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు నర్ర నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రామ సభ, గ్రామ పంచాయతీ తీర్మానాలకు అనుగుణంగా రోస్టర్ విధానంలో ఎన్నికైన ఫీల్డ్ అసిస్టెంట్లు 2006 నుంచి ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలోని సిబ్బందిని మాత్రమే మున్సిపాలిటీలో తీసుకొని ఫీల్డ్ అసిస్టెంట్లను తీసుకోకపోవడం శోచనీయమని తెలిపారు. ఈ విషయంపై కలెక్టర్, డీఆర్డీవో పీడీలకు వేర్వేరుగా వినతి పత్రాలను అందజేసినట్లు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్‌లో పెద్ది

నర్సంపేట : ఎమ్మెల్యే కోట ఎమ్మెల్సీ ఎన్నికలకు అభ్యర్థి దాసోజు శ్రావణ్ అసెంబ్లీలో నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌తో కలిసి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు. చిత్రంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్లు కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, నాగుర్ల వెంకటేశ్వరావు ఉన్నారు.

సావిత్రీబాయి పూలే ఆశయ సాధనకు పోరాడాలి

పోచమ్మమైదాన్/కరీమాబాద్/నర్సంపేట/నల్లబెల్లి/వర్ధన్నపేట, మార్చి 10 : సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే ఆశయ సాధనకు పోరాటాలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా పోచమ్మమైదాన్ సెంటర్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాధన సమితి జిల్లా అధ్యక్షుడు వలబోజు వెంకన్న, సీపీఐ మండల కార్యదర్శి బుస్సా రవీందర్, మండల అధ్యక్షుడు మేడిది అశోక్, పరికిరాల రమేశ్, బచ్చల స్వప్న, భాగ్యలక్ష్మి, మల్లయ్య, చందు, దస్రు, సుకన్య, మాధవి, కరుణాకర్ పాల్గొన్నారు. అలాగే, రంగశాయిపేటలో సావిత్రీబాయా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేడల ప్రసాద్, కత్తెరపల్లి దామోదర్, కలకోట్ల కుమారస్వామి, సింగారపు రాజ్‌కుమార్, మంద స్వామి, ఎనబోతు లక్ష్మీనారాయణ, వేల్పుగొండ రాజేశ్, హరి పాల్గొన్నారు. నర్సంపేటలో ఐద్వా ఆధ్వర్యంలో సావితీబాయి చిత్రపటానికి నివాళులర్పించారు. పట్టణ కార్యదర్శులు ఎండీ ఫరీదా, బిట్ర స్వప్న, కోశాధికారి వజ్జంతి విజయ, రుద్రారపు లక్ష్మీ పాల్గొన్నారు. అలాగే, బీసీ హక్కుల సాధన సమితి పట్టణ కన్వీనర్ మహాదేవుని జగదీశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రామగిరి రవికుమార్, ఆకారపు మోహన్, ఓర్సు సాంబయ్య, వెంకన్న పాల్గొన్నారు. నల్లబెల్లిలో బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చింతకింది కుమారస్వామి, కోల లింగయ్య, తంగెళ్ల వేణు, గుండెబోయిన రాజన్న, భాషబోయిన సమ్మయ్య, బూస కుమారస్వామి, హరీశ్, సుభాష్ పాల్గొన్నారు. వర్ధన్నపేటలోని అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాదిగల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జన్ను రాములు, వల్లందాసు కుమార్, ఈరెల్లి శ్రీనివా